

బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

## గుడుంబా స్థావరాలపై దాడులు

తొర్రూరు, అక్టోబర్ 20 : మండలంలోని సోమారపుకుంట తండా పంచాయతీ పరిధిలోని తులసియా తండాలో శుక్రవారం గుడుంబా స్థావరాలపై దాడులు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల వేళలో గ్రామాల్లో మద్యం తాగి గొడవలు పడకుండా బెల్ట్ షాపులు, గుడుంబా స్థావరాలపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. 30 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని 2వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై జగదీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

### కేసముద్రంలో..

కేసముద్రం :మండల కేంద్రంలోని గిర్నితండా, ఎన్టీఆర్‌నగర్ కాలనీల్లోని గుడుంబా స్థావరాలపై శుక్రవారం దాడి చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. గిర్నితండా, ఎన్టీఆర్‌నగర్ కాలనీల్లో గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. గిర్నితండాకు చెందిన విజయ ఇంట్లో 20 లీటర్ల గుడుంబా, ఎన్టీఆర్ నగర్‌కు చెందిన వీరమ్మ ఇంట్లో 20 లీటర్ల గుడుంబాను స్వాదీనం చేసుకొని ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844. NT-320501

కావలెను

★మన పట్టణంలో కొత్తగా స్థాపించిన బ్రాంచ్ నందు పనిచేయుటకు ఇంటర్, డిగ్రీ, బి.టెక్, PG చదివిన అభ్యర్థులు కావలెను. వర్క్ ఫ్రం హోం కలదు. సెల్ : 7995675525 NTW-315286

HMDA అప్రూవ్డ్ ప్లాటు

★దసరా స్పెషల్ ఆఫర్! 5 గ్రా గోల్డ్ ఫ్రీ HMDA పరిధిలో ఇప్పుడే ఇల్లు కట్టుకొని ఉండటానికి తక్కువ ధరలోనే రెరా అప్రూవ్డ్ ఓపెన్ ప్లాట్స్ బ్యాంక్ లోన్, స్పాట్ రిజి: 8639545438. NT-320354

PLOT FOR SALE

★హైదరాబాద్, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహేడ, జనచైతన్య, బాటసింగారం శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును/ అమ్మబడును, నో Brokers. Ph: 9666912111, 7995005999. NT-318030

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

| HANAMKONDA | WARANAGAL |
|---|---|
| 9182777563 | 9182777556 |
| 9182777618 | 9182777557 |
| 9182777213 | 9182777558 |

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565


# పెరిగిన నిఘా

- ఎన్నికలు సమీపిస్తుండడంతో ముమ్మరంగా తనిఖీలు
- జిల్లాలో 10చోట్ల చెక్ పోస్టులు, నోటిఫికేషన్ వచ్చిన వెంటనే మరో రెండు..
- ప్రతి వాహనాన్ని క్షణ్ణంగా చెక్ చేస్తున్న పోలీసులు

మహబూబాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో జిల్లాలో తనిఖీలు ముమ్మరమయ్యాయి. ముఖ్యంగా రూ.50వేలకు మించి నగదు, మద్యం అక్రమ రవాణాపై అధికారులు నిఘా మరింత పెంచారు. ప్రతి వాహనాన్ని క్షణ్ణంగా తనిఖీ చేసి పంపిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన వెంటనే జిల్లాలో 10 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. నోటిఫికేషన్ విడుదల తర్వాత వచ్చేనెల 3 నుంచి పెద్దవంగర, కురవి మండలాల్లో ఒక్కో చెక్‌పోస్టు చొప్పున ఏర్పాటు చేయనున్నారు. 2023 సాధారణ ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. పదిచోట్ల ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని ఆపి, తనిఖీ చేసిన అనంతరం తిరిగి పంపిస్తున్నారు. ప్రతి చెక్ పోస్ట్ వద్ద ఇద్దరు ఎస్ఐలు, ఇద్దరు ఏఎస్ఐలు, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖలలో ఏదైనా ఒక శాఖ నుంచి ఒక ఏఈ, నలుగురు పోలీస్ కానిస్టేబుళ్లు, ఎక్సైజ్ శాఖ నుంచి కానిస్టేబుల్, రెవెన్యూ శాఖ నుంచి అధికారి చెక్ పోస్టులో ఉంటున్నారు. కార్లు, ఆటోలు, ఆర్టీసీ బస్సులు, ద్విచక్రవాహనాలు ఇలా ప్రతి వాహనాన్ని పోలీసులు తనిఖీ చేస్తున్నారు. వీటితోపాటు ప్రజాప్రతినిధులు, నాయకుల వాహనాలను కూడా వదిలిపెట్టడం లేదు. పది చెక్ పోస్టులు కాకుండా ఫ్లయింగ్ స్క్వాడ్స్, మైక్రో అబ్జర్వర్స్, ప్రత్యేక బృందాలు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. చెక్‌పోస్టుల వద్ద నగదుతోపాటు బెల్టు షాపుల్లో తనిఖీలు చేసి మద్యం సీజ్ చేసి, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తున్నారు. అలాగే గుడుంబా స్థావరాలపై నిఘా పెంచారు. గుడుంబా బట్టీలను ధ్వంసం చేసి, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఆకస్మిక పర్యటిస్తూ పోలీసులను అప్రమత్తం చేస్తున్నారు. అంతేకాకుండా జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో కూడా ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం బెల్టు షాపులపై పోలీసులు మరింత నిఘా ఏర్పాటు చేశారు. బెల్టుషాపుల్లో దొరికిన మద్యం బాటిళ్లు ఏ వైన్స్ షాపు నుంచి తెస్తున్నారో గుర్తించి సంబంధిత వైన్స్ కూడా కేసు నమోదు చేస్తున్నారు.




డోర్నకల్ ఎస్సీ,బీసీ కాలనీ చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో 10 చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. కేసముద్రం మండలం కోరుకొండపల్లి క్రాస్ రోడ్డు వద్ద, గూడూరు మండలం భూపతిపేట వద్ద, డోర్నకల్ మండలం ముల్కలపల్లి, డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ, బీసీ కాలనీలో, దంతాలపల్లి మండలం పెద్దముప్పారం క్రాస్ రోడ్డు వద్ద, సూర్యాపేట - మహబూబాబాద్ సరిహద్దుల్లో, మరిపెడ మండలం రాజీవ్ విగ్రహం వద్ద, నెల్లికుదురు మండలం నెల్లికుదురు క్రాస్ రోడ్ వద్ద, బయ్యారం మండలం నామాలపాడు వద్ద, గార్ల మండలం బంధం రోడ్డు వద్ద మొత్తం పది చెక్ పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా వచ్చే నెల 3 నుంచి జిల్లాలో మరో రెండు చెక్‌పోస్టుల ను ఏర్పాటు చేసేందుకు ప్రాంతాలను గుర్తించారు. పెద్ద వంగర మండల కేంద్రంలో ఒకటి, కురవి మండల కేంద్రంలోని పెట్రోల్ పంపు వద్ద మరో చెక్ పోస్ట్ ఏర్పాటు చేయనున్నారు.




కలెక్టరేట్‌లో ఓటరు చైతన్యగీతం సీడీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శశాంక, ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్

## ఎన్నికల నియమావళిని పాటించాలి

- కోడ్‌కు లోబడి పనులు చేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 20 : అసెంబ్లీ ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి శశాంక అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లు, నియమాలపై విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల సదుపాయాలను కల్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి, మండల, గ్రామస్థాయిలో నోడల్ ఆఫీసర్లను నియమించామని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఓటు ప్రాధాన్యత, వేసే విధానాన్ని కళాకారుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి ఈ నెల 31 వరకు అవకాశం ఉందని, ఇప్పటి వరకు ఓటు నమోదు చేసుకోని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ, ఎన్నికల విధులకు అదనపు సిబ్బందిని సిద్ధం చేస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్‌కు లోబడి తమ పని విధానాలు ఉండేలా చూడాలన్నారు. ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి చెక్‌పోస్టు వద్ద ఎస్సైలు తనిఖీలు నిర్వహించడంతోపాటు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలుచోట్ల లెక్కలు చూపని నగదు, గుడుంబా, నల్లబెల్లం, అక్రమంగా తరలించే పీడీఎస్ బియ్యం, మద్యాని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

వెంకటాపూర్, అక్టోబర్ 20 : చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని అందుగులమేదిలో చోటు చేసుకుంది. ఎస్సై చల్లా రాజు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కోట రాములు (40) మంగళవారం సాయంత్రం చేపల వేటకు గ్రామ సమీపంలోని రామచంద్రు కుంటకు వెళ్లగా అతడి భార్య పుట్టింటికి వెళ్లింది. శుక్రవారం తాటి చెట్లు ఎక్కేందుకు వెళ్లిన గౌడలకు కుంటలో మృతదేహం కనిపించగా వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతుడిని రాములుగా గుర్తించారు. మృతదేహం కుళ్లిపోవడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి సోదరుడు మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## బావిలో పడి ఒకరి మృతి

కేసముద్రం, అక్టోబర్ 20 : బావిలో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. తాళ్లపూసపల్లికి చెందిన కందుకూరి వెంకటయ్య-ఉప్పలమ్మ దంపతుల కొడుకు శ్రీను (38) తమ గేదెలను మేత కోసం తీసుకెళ్లి, బావి పక్కన కూర్చున్నాడు. ఒక్కసారి పిడుసొచ్చి బావిలో పడిపోయాడు. తల్లి ఉప్పలమ్మ గమనించి గ్రామస్తులకు తెలుపగా, మృతదేహాన్ని బయటకు తీశారు. శ్రీను తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### విద్యుదాఘాతంతో మరొకరు..



రాములు(ఫైల్)

చిన్నగూడూరు, అక్టోబర్ 20 : విద్యుదాఘాతంతో ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని చేపూరితండాలో శుక్రవారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్ర కారం.. తండాకు చెందిన నేతావత్ రాములు(60) మిర్చిపంటకు నీళ్లు పెడుతుండగా, విద్యుత్‌వైర్లు కాలికి తగిలి షార్ట్ సర్క్యూట్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు కరె ధారాసింగ్, మన్నె చెన్నయ్య పరామర్శించారు.

### చికిత్స పొందుతూ ఇంకొకరు..



నారాయణరెడ్డి(ఫైల్)

నర్సింహులపేట, అక్టోబర్ 20: చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందిన ఘటన శుక్రవారం మండలంలోని ఎర్రలచ్చయ్యబంజర గ్రామంలో జరిగింది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. ఎర్ర నారాయణరెడ్డి (74) గత సెప్టెంబర్ 30న బైక్‌పై బ్యాంకుకు వెళ్తుండగా నర్సింహులపేట- ఎర్రలచ్చయ్య బంజర రోడ్డు మూలమలుపు వద్ద కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హన్మకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అతడి భార్య రంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.